పుట్టిన ప్రతీ మనిషికీ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం వద్దన్నా వచ్చి మీద పడతాయి. వీటికి ప్రాంతాలతోటీ, దేశాలతోటీ నిమిత్తం లేదు. మచ్చలు లేని మనుషుల్లా, వేదన లేని జీవితాలూ ఉండవు. ప్రేమా, అభిమానం, ఆప్యాయతలకి అతీతంగా మనుషులు ఉండలేరు. తరచి చూస్తే ఏ మూలో అవి నక్కి నక్కి దాక్కుంటాయి. అమెరికన్ దేశస్థులు ఎంతో మెటీరియలిస్టిక్‌గా జీవితాలు గడుపుతారని ఎంతో కాలంగా మన మధ్య నలుగుతున్న అపోహ. అలాంటి అపోహలని పటాపంచలు చేసే ఒక అమెరికన్ దంపతుల హృదయ స్పందన.

సాయిబ్రహ్మానందం గొర్తి

11

# ఆ ఇంట్లో ఒకరోజు

బాలి





విశాలమైన ఆ భవంతి ముందు కారు ఆపాను. గేట్ ఇంటర్‌కమ్ బజర్ నొక్కి- ''మిస్టర్ స్టీవెన్సన్! నేను హేరీ!'' అని చెప్పగానే, ''వెల్‌కమ్,'' అంటూ గేటు తెరిచాడు.

మెల్లగా ఆ గేటు తెరుచుకోగానే కారు లోపలకి పోనిచ్చాను. ఇంటి ముందు డ్రైవ్ వేలో స్టీవ్ నాకోసం ఎదురుచూస్తూ కనిపించాడు. కారు దగ్గరకి వచ్చి నన్ను ఆలింగనం చేసుకున్నాడు.

స్టీవ్ చూడ్డానికి క్లింట్ ఈస్ట్‌వుడ్‌కి మరింత ముసలితనం వస్తే ఎలా వుంటుందో అలా ఉన్నాడు. అతనికి ఎనభై అయిదేళ్లు పైనే వయసు ఉంటుంది. ఆర్మీలో పనిచేయడం వల్లనేమో శరీరం ఇంకా ధృఢంగానే ఉంది. మొహంలో ముడతలు తెల్లటి గీతలు గీసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నా కొలీగ్ బిల్ వాళ్ల నాన్న స్టీవ్. డెల్ కంప్యూటర్స్‌లో నేనూ, బిల్ కలిసి పనిచేస్తాం. అట్లాంటాలో ఒక పెద్ద కంపెనీలో వ్యాపార నిమిత్తమై ఇద్దరం వచ్చాం. మా కంపెనీకి పది మిలియన్ల డీల్ వచ్చింది.  థాంక్స్ గివింగ్ హాలిడేస్ రావడంతో కొన్ని పరిస్థితుల వల్ల అది సోమవారానికి వాయిదాపడింది. మాకు ఆ కంపెనీ సి.యీ.ఓతో మీటింగ్ ఉంది. కనుక నేను సోమవారం వరకూ ఉండాల్సి వచ్చింది.

వెనక్కి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లి రావడం కంటే ఇక్కడే అట్లాంటాలో ఉండిపోదామని అనుకున్నాం. అసలు బిల్ అట్లాంటాలో ఉండి, నేను వెనక్కి వెళ్లాలి. అట్లాంటాలో పనవ్వగానే వాళ్ల నాన్నని చూడ్డానికి మాంట్‌గోమరీ వెళదామని బిల్ అనుకున్నాడు. ఈలోగా- థాంక్స్ గివింగ్‌కి బిల్ భార్య లోరా షికాగో రావాల్సిందేనని పట్టుబడితే, బిల్ నన్ను పని ముగించుకు రమ్మని, అతను షికాగో వెళ్లిపోయాడు. వాళ్ల నాన్నను చూడ్డానికి వెళ్లలేకపోయినందుకు బాధపడ్డాడు బిల్. తన బదులు నన్ను వెళ్లమని కోరాడు. హోటల్లో ఉండి చేసేదేముందని సరేనన్నాను.

అలా అనుకోని పరిస్థితుల్లో నేను ఈ ఊరు మాంట్‌గోమరీ వచ్చాను.

ఇంటి ప్రధాన ద్వారం బయట, 'స్టీవ్ మెకెన్నా, క్రిష్టీ మెకెన్నా' పేర్లు చెక్కి ఉన్న ఒక ఉడెన్ బోర్డు కనిపించింది.

లోపలకి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టాడు.

"నువ్వు రావడం చాలా సంతోషంగా ఉంది. బిల్ నాకు ఫోనులో అంతా చెప్పాడు," అంటూ నారింజరసం ఇచ్చాడు. కుశల ప్రశ్నల తరువాత క్రిస్టీని ఒక వీల్ చైర్లో తోసుకుంటూ తీసుకొచ్చాడు. ఆమెను చూడగానే సినిమా తార మెరిల్ స్ట్రీప్ గుర్తొచ్చింది. ముఖ కవళికలు అలానే ఉన్నా, ముడతలు పడ్డ చర్మం ఆమె వయసుని చెబుతూనే ఉంది. క్రిస్టీ చూడ్డానికి స్టీవ్ కంటే పెద్దదానిలాగే కనబడింది. మాట కూడా వణుకుతూ ఉంది.

నన్ను చూసి ఒక్కసారి లేవబోయి, పడిపోతూండగా స్టీవ్ వచ్చి పట్టుకున్నాడు.

"హనీ! నన్ను పిలవచ్చుగా...?" అంటూ చికాగ్గా ఆమెకేసి చూశాడు.

నేను వస్తున్నానని తెలిసి నిన్న రాత్రి నుండి తెగ ఆరాటపడి ఏర్పాట్లు చేసేటప్పుడు కాలు జారి పడిందని చెప్పాడు.

భార్యాభర్తలిద్దరూ చాలాసేపే కబుర్లు చెప్పారు. మాటల్లో అసలు టైమే తెలియలేదు.

"డ్రైవ్ ఎలా ఉంది? నువ్వు హైవే 85 మీద వచ్చావా? కొంచెం వైన్ తీసుకుంటావా...?" స్టీవ్ ప్రశ్నల మీద ప్రశ్నలు. సాయంత్రం తీసుకుందామని చెప్పాను.

నేనూ, బిల్ మధ్యాన్నం లంచ్ అయ్యాక వ్యాహ్యాళికి వెళ్లేవాళ్లం. అప్పుడు మాటల్లో వాళ్ల అమ్మానాన్నల గురించి నాకు చాలా చెప్పేవాడు బిల్. ఇంతకు మునుపు బిల్ తల్లితండ్రుల ఫొటోలు చూశాను. అంతే!

స్టీవ్ వాళ్ల ఇల్లు చూపించాడు. అది ఇల్లు కాదు. పది పడక గదులున్న విశాలమైన పెద్ద భవంతి. నాకు బిల్ స్టడీ రూము, బెడ్రూమూ అన్నీ స్టీవ్ చూపించాడు.

బిల్ చిన్నప్పటి ఫొటోలూ, సర్టిఫికెట్లూ ఫ్రేముల్లో పెట్టి ఆ గది గోడల మీద కనిపించాయి. బిల్ రూము అంతా రాక్ అండ్ రోల్ సింగర్ ఎల్విస్ ప్రెస్లీ ఫొటోలతో నిండిపోయింది.

"బిల్ గిటార్ బాగా వాయిస్తాడు," స్టీవ్ చెప్పాడు. నాకూ తెలుసు, నేనూ బిల్ గిటార్ ప్రోగ్రాములకి వెళ్లాను.

మేడ మెట్ల దగ్గర ఒక గది వైపు వెళ్లి తలుపు తీయబోతూండగా, "స్టీవ్!" అంటూ వద్దన్నట్లు తలాడించింది క్రిస్టీ. వెంటనే అతను వెనక్కి వచ్చేసాడు. ఏవిటా అనుకున్నాను కానీ, నేనేమీ మాట్లాడలేదు.

స్టీవ్ నా గురించీ, ఇండియా గురించీ అడిగాడు. బిల్‌లాగే నేనూ మా తల్లితండ్రులకీ ఒకణ్ణే కొడుకుననీ, ఒక చెల్లెలు ఆస్ట్రేలియాలో ఉంటోందనీ, మా అమ్మా, నాన్నా రాజమండ్రీలో ఉంటారనీ చెప్పాను.

"ఇంత పెద్ద ఇంట్లో మీరిద్దరే ఉంటారా? ఎలా మేనేజ్ చేస్తారు?" ఆశ్చర్యం వేసింది నాకు. నెల నెలా పనివాళ్లు వస్తారనీ, చిన్న చిన్న పనులు తనే చేస్తాననీ చెప్పాడు. ఎంతైనా కొన్ని పనులు మనమే చేసుకోక తప్పదని నవ్వుతూ అన్నాడు.

''ఈ ఇంట్లోనే నేను పెరిగాను. బిల్ కూడా. మాకు చాలా జ్ఞాపకాలు ఈ ఇంటితోనే ముడిపడి ఉన్నాయి. బిల్ మమ్మల్ని కాలిఫోర్నియా వచ్చేయమంటాడు,'' అన్నాడు.

నేనూ అదే అన్నాను కూడా, వచ్చేయచ్చుగా అన్నట్లు. అతను గట్టిగా నవ్వాడు.

''మనమందరం మనుషుల్ని ప్రేమిస్తాం అన్న భ్రమలో ఉంటాం. కానీ-వస్తువుల్నీ, వూళ్లనీ, ఇళ్లనీ ప్రేమించనంతగా దేనినీ ప్రేమించం,'' కళ్లు ఎగరేస్తూ అన్నాడు. గట్టిగా నవ్వేసాను.

మరలా అతనే అన్నాడు.

''ఇల్లు వదలడం అన్నది ఒక మానసిక సమస్య. పరాయి వాళ్లింట్లో ఉంటే స్వేచ్ఛ ఉండదేమోనన్న పిరికితనం.''

''బిల్ పరాయివాడు ఎలా అవుతాడు? మీ కొడుకే కదా?'' నవ్వుతూ రెట్టించాను.

''వాడు పరాయి కాదు, వాడిల్లు పరాయిది. పనికిరాని ఎన్నో మానసిక అంశాలూ, అహాలూ వుంటాయి. అంతే!''

అతను చెప్పింది పొడిగించక, నేను వేరే విషయం మీదకి దృష్టి మరల్చాను.

భోజనం చేసాక స్టీవ్ బయటకి వెళ్లాలి అంటే నేనూ వస్తానని బయల్దేరాను. స్టోరులో ఉండగా క్రిస్టీ కాల్ చేసింది.

''మనం వెంటనే వెనక్కి వెళ్లాలి, క్రిస్టీ పడిపోయిందట.''

హుటాహుటిన వెనక్కి వెళ్లాం. వెళ్లేసరికి క్రిస్టీ నేలమీద పడిపోయి ఉంది. అంతా బాగానే ఉంది కాని లేవలేపోతోంది. దూరంగా వీల్ చైర్ ఒరిగిపోయి పడుంది.

నేనూ, స్టీవ్ మెల్లగా లేవనెత్తి వీల్ చైర్లో కూర్చోబెట్టాం.

''నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధిరాదు,'' అంటూ క్రిస్టీ మీద కసురుకున్నాడు స్టీవ్.

సాయంత్రం థాంక్స్ గివింగ్ డిన్నర్‌కని ఏదో చేద్దామని కిచన్‌లోకి వెళ్లిందట. ఫ్రిజ్ డోరు తీస్తూండగా జారి పడిపోయానని చెప్పింది.

ఆ సాయంత్రం థాంక్స్ గివింగ్ డిన్నర్ కలిసి చేశాం. స్టీవ్, క్రిస్టీ నేను వచ్చినందుకు చాలా సంతోషించారు. వాళ్ల ఆనందం ప్రతీ మాటలోనూ, ముఖ్యంగా వారి కళ్లల్లో కనిపిస్తూనే ఉంది. స్టీవ్ కోసం ఒక స్క్రీమింగ్ ఈగిల్ వైనూ, క్రిస్టీకి స్వెటరూ బహుమతులు తీసుకెళ్లాను. అవి చూసి వాళ్ల ఆనందానికి అవధుల్లేవు. క్రిస్టీ అయితే కళ్లనీళ్లు పెట్టుకుంది.

''ఇంత ఎక్స్‌పెన్సివ్ వైన్...'' అంటూ స్టీవ్ అనబోతే, అది నేనూ, బిల్ కలిసి కొన్నాం అని చెప్పాను. ఆ సాయంత్రం ఎంతో సంతోషంగా గడిచిందని వాళ్లు ఇద్దరూ ఒకటికి పదిసార్లు అన్నారు. వాళ్లని చూస్తే నాకూ ముచ్చటేసింది.

క్రిస్టీకి రాత్రి త్వరగా నిద్రపోయే అలవాటట. ఆమెను స్టీవ్ పడకగది వైపుగా తీసుకెళ్లాడు.

‘‘రాత్రి ఎనిమిదయితే చాలు, క్రిస్టీ నిద్రకి ఆగలేదు. అయ్యో మందులు ఇవ్వడం మర్చిపోయాను,’’ అంటూ మరలా వెనక్కి వెళ్లి కొద్దిసేపయ్యాక తిరిగి వచ్చాడు.

ఇద్దరం కాసేపు ప్రెసిడెంట్ ఎలక్షన్స్ గురించీ, పోలిటిక్స్ గురించీ మాట్లాడు కున్నాం. ఇరవయ్యేళ్ల వయసులో స్టీవ్ తను రెండో ప్రపంచ యుద్ధంలో పని చేసాననీ ఆ సంగతులనీ చెప్పుకొచ్చాడు. మాటల్లో బిల్ చదువూ, క్రిస్టీతో తన పెళ్లీ ఇవన్నీ ప్రస్తావనకి వచ్చాయి.

‘‘బిల్ మమ్మల్ని కాలిఫోర్నియా వచ్చేయమంటాడు. ఎలా రావడం? అల వాటయిన ఊరు. ఇక్కడ కొంతమంది ఫ్రెండ్స్ ఉన్నారు. రోజూ మధ్యాన్నం పూల్ (బిలియర్డ్స్) ఆడటానికి వెళతాను. క్రిస్టీకి ఆరోగ్యం చెడిపోయాక వెళ్లడం తగ్గించేశాను. ఒక్కతినీ వదిలి వెళ్లలేను,’’ చెబుతూంటే స్టీవ్ గొంతు మారింది.

‘‘నిజానికి ఇవాళ బిల్ వద్దామనే అనుకున్నాడు. మీ కోడలు ‘వచ్చి తీరాలీ’ అంటే షికాగో వెళ్లాడు. మీరంటే అతనికి చాలా ప్రేమ. మీ గురించి తరచూ చెబుతూనే ఉంటాడు. తను రాలేకే నన్ను వెళ్లమని అడిగాడు. నేనూ ఖాళీగానే ఉన్నాను కనుక వచ్చాను. మీకు అనవసరంగా నా వల్ల ఇబ్బంది కలిగింది, సారీ...’’ నొచ్చుకుంటూ అన్నాను.

‘‘నాట్ ఎటాల్! నిజానికి నువ్వు వస్తున్నావని తెలిసి క్రిస్టీ చాలా సంతోషించింది. తనకి అన్నీ ఒక పద్ధతి ప్రకారం ఉండాలి. ఆ హడావిడిలో జారి పడి కాలు బెణికింది. అందుకే వీల్ చైర్లో ఉంది. ఈ వయసులో మతిమరపొకటి. అందుకే ఆమెను వదిలి బయటకు వెళ్లడం తగ్గించేసాను. రెండ్రోజుల క్రితం బిల్ వస్తున్నాడనీ, వాడికోసం ఇల్లు శుభ్రం చేద్దామని మొదలుపెట్టింది. నేను ఇక్కడ టీవీ చూస్తున్నాను. వంటిం ట్లోంచి ఒకటే కాలిన వాసన. వెళ్లి చూస్తే స్టవ్ మీద నల్లగా మాడి మసైన చికెన్. ఒక్క క్షణం ఆలస్యం అయ్యుంటే మంటలు వచ్చుండేవి. స్టవ్ మీద పెట్టానన్న సంగతే మర్చి పోయింది. సారీ... మా చెత్తంతా నీకు చెప్పి బోర్ కొట్టిస్తున్నా...’’ అంటూ నాకేసి చూశాడు.

లేదన్నట్లు తలూపాను. మీరూ కాలిఫోర్నియా వస్తే బావుండేది కదా? అని మరోసారి వంత పాడాను.

‘‘చెప్పినంత సులభం కాదు, ఇక్కడ నుండి కదలడం. బిల్ ఉంటే కాస్త బాసటగా ఉంటుంది, ఒప్పుకుంటాను. వాడున్న ఇంటి వెనుక ఇన్-లాస్ అపార్ట్‌మెంట్ కట్టిస్తాననీ అన్నాడు. ఒక్కోసారి అనిపిస్తూ ఉంటుంది, వెళితే బానే ఉంటుంది కదా అని. మా నాన్న నా గురించి వర్రీ అయ్యేవాడు. నేను యుద్ధాలూ, సైన్యం అంటూ ఎప్పుడూ వాళ్లని పట్టించుకోలేదు. నేను కూడా చాలా ఆలస్యంగా పెళ్లి చేసుకున్నాను. క్రిస్టీతో పెళ్లయిన కొన్నేళ్లకి మా అమ్మా, నాన్నా పోయారు. బిల్ పుట్టేసరికి నాకు నలభై అయిదేళ్లు. వాడికీ వాడి కెరీర్ ముఖ్యం కదా? ఇక్కడ ఈ మాంట్‌గోమరీలో వాడికి

నచ్చే ఉద్యోగం ఎక్కడా దొరకదు. చిన్నప్పటి నుండీ వాడికి కంప్యూటర్ల పిచ్చి. వాడి భార్య కూడా అదే ఉద్యోగం! వాడి జీవితంలోకి మేం చొరబడకూడదనుకున్నాం. నువ్వు చెప్పినట్లు రావచ్చు. రాలేని పరిస్థితి... అంతే!'' చెబుతూంటే అతని గొంతు గద్గదమయ్యింది. అనసవరంగా అతన్ని మరోసారి కెలికి బాధపెట్టేనా అనిపించింది.

మెల్లగా అతను సోఫాలోంచి లేచి హాలులో మెట్ల వైపుగా నడిచాడు. వెనక్కి తిరిగి నన్ను కూడా రమ్మన్నట్లు సైగ చేశాడు. నేనూ లేచి వెళ్లాను.

ఒక గది తలుపు దగ్గర ఆగిపోయాడు. ఇంతకుముందు ఆ గది తెరవ బోతూంటే క్రిస్టీ వద్దని వారించడం గుర్తొచ్చింది.

''యూ మేడ్ మై డే, జెంటిల్‌మన్...!'' అంటూ నన్ను ఆలింగనం చేసుకొని మెల్లగా తలుపు తెరిచి లైటు వేశాడు.

ఆ గదంతా లైట్లతో మిరిమిట్లు గొలుపుతూ ఉంది. చాలా పెద్ద గదిలో ఒక వైపుగా పెద్ద క్రిస్మస్ ట్రీ అలంకరించబడి ఉంది. ఆ చెట్టు చుట్టూ చాలా గిఫ్ట్లు పేరుకు పోయి ఉన్నాయి. ఆ చెట్టు దగ్గర నేల మీద కూర్చున్నాడు స్టీవ్. నన్నూ కూర్చోమని సైగ చేశాడు.

''మా ఇంట్లో క్రిస్మస్ అతి పెద్ద పండగ. ప్రతీ ఏటా ఘనంగా జరుపుకునే వాళ్లం. మా కజిన్స్, రెలటివ్స్ అందరూ వచ్చేవారు. చాలామంది కజిన్స్ పోయారు. ప్రతీ ఏడూ అందరికీ గిఫ్ట్లు కొన్నట్లే బిల్ కోసమూ గిఫ్ట్లు కొంటాం. వాడు క్రిస్‌మస్‌కి వచ్చి పన్నెండేళ్లు పైనే దాటింది. ఈ గిఫ్ట్లు అన్నీ గత పన్నెండేళ్లగా వాడికోసం కొన్నవి. ఏటా వాడికోసం రెండు గిఫ్ట్లు కొంటాం. ఒకటి ఈ క్రిస్మస్ చెట్టు దగ్గర, మరోటి వాడు రాకపోతే పంపడానికి. ఎప్పుడైనా క్రిస్‌మస్‌కి వాడు వస్తే వాడి చేత ఓపెన్ చేయిద్దామని నేనూ, క్రిస్టీ అనుకుంటూ ఉంటాం. వాడు వచ్చే సంవత్సరం వస్తానంటూ ప్రతీ క్రిస్‌మస్‌కి వాయిదా వేస్తాడు. చాలా ఏళ్లగా ఇదే వరస. మేమూ అడగడం మానేసాం. వీలు కుదిరితే వాడు రాకుండా ఉంటాడా? అని సర్ది చెప్పుకుంటూ ఉంటాను. ఇవాళ అనుకోకుండా నువ్వొచ్చావు. ఈ గిఫ్ట్లలో కొన్ని నువ్వు ఓపెన్ చెయ్యి. కొన్ని నువ్వు తీసుకో. బిల్‌కి కొన్ని ఇయ్యి. ఇదంతా నేను క్రిస్టీకి చెప్పదలుచుకోలేదు. చెప్పినా తనకి గుర్తుంటుందని అనుకోను. ఈ వ్యాధితో ఎన్నాళ్లు బ్రతుకుతుందో తెలీదు... ఈ అల్జీమర్స్ తనే కాదు, నేనూ భరించలేకపోతున్నాను. ఏదీ గుర్తుండదు. ఏం చేస్తోందో కూడా తనకి తెలీదు. తరచూ న్యూమోనియా జ్వరం వంట్లో శక్తినంతా తినేస్తుంది. ఎన్నో చెయ్యాలని ఉంటుంది కానీ, శరీరం సహకరించదు. ఒక్కోసారి బ్రతకడం ఇంత అవసరమా...? అనిపిస్తూ ఉంటుంది...'' చెబుతూన్నంతసేపూ అతని కళ్లల్లో నీళ్లు గమనిస్తూనే ఉన్నాను.

నేను వెంటనే లేచి అనునయంగా భుజం తట్టాను. అక్కడున గిఫ్ట్ ఒకటి చేతుల్లోకి తీసుకొని బిల్‌కి ఇస్తానని చెప్పాను. అతని ఎదుటే గిఫ్ట్ చుట్టూ కట్టిన రంగు కాగితాలు చించి తెరచి చూశాను. ఆశ్చర్యంగా అది ఒక గోల్డ్ కలర్ వాచీ. అది అసలు

సిసలైన గోల్డేనని స్టీవ్ అన్నాడు. అక్కడ గిఫ్ట్లు అన్నీ పరికించి చూశాను. కొన్నింటి మీద బిల్ పేరు. బిల్ భార్య లోరా పేరునా చాలానే ఉన్నాయి.

"ప్రతీ ఏటా థాంక్స్ గివింగ్ అవ్వగానే ఈ గది తెరుస్తాం. ఏడాదిపాటు పేరుకున్న దుమ్మునీ, ధూళినీ క్రిస్టీ స్వయంగా శుభ్రపరుస్తుంది. పనివాళ్లని పెట్టమన్నా వినదు. అదోరకం పిచ్చి. క్రిస్మస్ ట్రీ డెకరేషన్ పనుల్లోనే మా కాలం గడిచిపోతుంది. ప్రతీ ఏటా వాడూ మాకు బహుమతులు పంపుతాడు. కానీ వాడు లేకుండా... ఇవి..." అతనికి మాటలు పెగల్లేదు.

"స్టీవ్..." అతన్ని చూస్తే బాధ కలిగింది.

వెంటనే అతను సంబాళించుకొని, "నా మనసులోని చెత్తంతా నీమీద కుమ్మరిస్తున్నాను... క్షమించు... ఒంటరితనం క్రూరమైంది..." అన్నాడు.

ఒక్కసారి తలుపు దగ్గర శబ్దం అయితే ఇద్దరం అటుగా చూశాం.

తలుపు దగ్గర వీల్ ఛైర్లో క్రిస్టీ- ఆమె నిస్తేజంగా మాకేసే చూస్తూ ఉంది.

✤

ఆ మర్నాడు ఉదయం వెళుతూండగా వాళ్లు నాకు గిఫ్ట్లు ఇచ్చారు. వద్దని అంటే ఇది థాంక్స్ గివింగ్ ఆనవాయితీ అన్నారు. వాళ్లని కష్టపెట్టడం ఇష్టంలేక తీసుకున్నాను.

"నిన్ను కలవడం చాలా సంతోషంగా ఉంది హారీ! చాలారోజుల తరువాత క్రిస్టీ కళ్లల్లో సంతోషం చూశాను. అఫ్‌కోర్స్! నాక్కూడా..." అంటూ ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు.

కారు స్టార్ చేస్తూండగా ఉండమన్నట్లు సైగ చేశాడు స్టీవ్. కారు అద్దాల కిటికీ తెరిచాను.

"నీ నుండి నాకొక ప్రామిస్ కావాలి," నాకేసి చూస్తూ అన్నాడు. అలాగేనన్నట్లు తలాడించాను.

"క్రిస్మస్ ట్రీ గురించా...?" సందేహంగా చూస్తూ అడిగాను.

కాదన్నట్లు తలాడించాడు.

"క్రిస్టీకి అల్జీమర్స్ అన్నది బిల్‌కి చెప్పద్దు. వాడికి తెలీదు. వాడు వచ్చి చాలా ఏళ్లయ్యింది. ఎప్పుడైనా స్కైపులో మాట్లాడినప్పుడు అది తెలియకుండా మేనేజ్ చేశాను. దయచేసి వాడికి చెప్పొద్దు... చెప్పి వాడిని కష్టపెట్టడం మాకు ఇష్టం లేదు ప్లీజ్."

"అల్జీమర్స్, అదేం చిన్నది కాదు..." అప్రయత్నంగా అన్నాను.

అతను విరక్తిగా నవ్వాడు.

"చాలా ఏళ్లుగా అంతకంటే పెద్దది మమ్మల్ని పీడిస్తోంది. దాని ముందు..." తలూపుతూ మధ్యలో ఆపేశాడు స్టీవ్.

ఏమిటన్నట్లు కళ్లు చిట్లించి చూశాను.

అతను చెయ్యూపుతూ, వెనుతిరిగి తనలో తనే గొణుక్కుంటూ లోపలకి వెళ్లిపోయాడు- ''వృద్ధాప్యం...''

మెల్లగా కారు పోనిచ్చాను.

స్టీవ్ పరిస్థితి చూస్తే జాలేసింది. ఒకపక్క ఇల్లు వదిలి వెళ్లలేడు. మరోపక్క కొడుకు కోసం ఆరాటం. వీటి మధ్య నలిగిపోయే రోజువారీ సమస్యలు. బిల్ గురించి నాకు బాగా తెలుసు. రోజూ తలుచుకుంటూ ఉంటాడు. ఎన్నోసార్లు తన తల్లితండ్రుల గురించి చెప్పాడు. ఇప్పుడు కళ్లారా స్టీవ్, క్రిస్టీల పరిస్థితి చూశాకా చెప్పాలా? వద్దా? అన్నది నా మనసుని దొలిచివేస్తోంది.

ప్రతీక్షణం వాళ్లు బిల్ వస్తే బావుండును, తమతో ఉంటే బాగుండననీ కాలం వెళ్లబుచ్చుతూ ఉంటారు. ఒక్కోసారి బిల్ వస్తున్నట్లుగానే భ్రమిస్తారు.

క్రిస్మస్ ట్రీ చుట్టూ వాళ్ల ఎదురుచూపులు తిరుగుతూ ఉంటాయి.

'స్టీవ్ బిల్ కోసం తాపత్రయపడ్డట్టు నా కోసం మా నా...' ఒక్కసారి ఆలోచనల్ల అగ్నిపర్వతం బ్రద్దలయ్యింది.

పంట కాలువ మీదుగా నన్ను బడికి దించుతూ నాన్న కళ్లలో మెదిలాడు.

*నవ్య వీక్లీ*
*31 ఆగస్టు 2016*

*




కోనసీమలోని అమలాపురంలో జూన్ 16న పుట్టిన సాయి బ్రహ్మానందం గొర్తి మొదటి కథ **పాపం సుబ్బారావు** 1980లో ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయింది. సరిహద్దు కథాసంపుటి, అంతర్జ్వలన నవల వెలువరించారు. ఇప్పటివరకూ యాభైకి పైగా కథలు రాశారు. నాటకాలు రాశారు, ప్రదర్శించారు. 2006లో పంచమ ధర్మం పద్య నాటకానికి నంది బహుమతి లభించింది. వృత్తిరీత్యా కంప్యూటర్ ఇంజనీర్. అమెరికాలోని శాన్‌హోసె, కాలిఫోర్నియాలో నివాసం.

***gorthib@yahoo.com***